దంచికొట్టిన వాన

న్యాల్‌కల్/బొల్లారం, ఆగస్టు 21: న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్, గంగ్వార్, రేజింతల్, మామిడ్గి, మిర్జాపూర్(బి), గుంజోట్టి, రాంతీర్థం తదితర గ్రామాల్లో, బొల్లారం పారిశ్రామిక వాడలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని పంటపొలాల్లో వరద చేరింది. అలాగే వాగులు, వంకలు, కుంటలు, చెరువుల్లోకి వరదనీరు చేరుతున్నది. భారీ వర్షానికి బొల్లారం మున్సిపల్ రోడ్లు జలమయంగా మారాయి. రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, ఆగస్టు 21: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో గృహజ్యోతి అమలు కాని వారు మున్సిపల్ కార్యాలయంలో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. ప్రజాపాలన దరఖాస్తులో మీటర్ నంబర్ రాయకపోయినా, తప్పుగా రాసినా వాటిని సవరించేందుకు మరోసారి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ప్రస్తుత బిల్లు, ప్రజాపాలన రసీదును జత చేసి దరఖాస్తు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

నాగల్‌గిద్ద, ఆగస్టు 21: మండలంలోని కరస్‌గుత్తి గ్రామంలోని బాలికల గిరిజన గురుకులంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీల ప్రవేశానికి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రశీలారాణి బుధవారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ తీసుకొని హాజరు కావాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30 నుంచి క్రీడాపోటీలు

హత్నూర, ఆగస్టు 21: మండల స్థాయి క్రీడాపోటీలు ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తామని హత్నూర ఇన్‌చార్జి ఎంఈవో వెంకటనర్సింహులు తెలిపారు. 30న అండర్-14, 17 విభాగాల్లో బాలికలు, 31న అండర్ 14, 17 విభాగాల్లో బాలురకు క్రీడాపోటీలు ఉంటాయని వివరించారు. దౌల్తాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించే పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ఎల్ ఆర్ఎస్ ప్రక్రియ పరిశీలన

కోహీర్, ఆగస్టు 21: మండలంలోని చింతల్‌ఘాట్ గ్రామంలో బుధవారం సంబంధిత అధికారులు చేపట్టిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి అమృత పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, ఆర్ఐ, నీటి పారుదల శాఖ ఏఈలు కలిసి సంయుక్తంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఆరు దరఖాస్తులు రాగా వివరాలను వందశాతం నమోదు చేయడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గంగారం విద్యార్థులు

కొండాపూర్, ఆగస్టు 21: మండల పరిధిలోని గంగారం ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగాకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు పండరినాయక్ తెలిపారు. శనివారం సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైనందుకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కోహీర్, ఆగస్టు 21: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని దిగ్వాల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కోహీర్ పట్టణానికి చిందిన ఫక్రుద్దీన్(74) హోండా సిటీ బైక్‌పై జహీరాబాద్ వెళ్తూ దిగ్వాల్ గ్రామానికి రాగానే హైదరాబద్ నుంచి జహీరాబాద్ వెళ్తున్న లారీ అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. కానీ అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

లక్ష్మణ్ (ఫైల్)

కంగ్టి, ఆగస్టు 21: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తుర్కవడ గామ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంగ్టి నుంచి నారాయణఖేడ్‌కు వెళ్తున్న కారు రాజారాం తండా వైపు కాలినడకన వెళ్తున్న గాజుల్ పాడ్ గ్రామానికి చెందిన కిందిదొడ్డి లక్ష్మణ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

మాట్లాడుతున్న కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

తెలంగాణ తొలి కవి దాశరథి

కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 21: తెలంగాణ తొలి కవి, మహాకవి దాశరథి కృష్ణమాచార్య అని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలను తెలంగాణ సాహిత్య అకాడమీ, తారా ప్రభుత్వ అటానమస్ కళాశాల తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సుద్దాల అశోక్ తేజ హాజరై మాట్లాడారు. 1944లో నాటి నైజాం పాలకులు, రజాకార్ల దాడుల్లో తగులబెట్టిన పందిళ్లలోనే కవి సమ్మేళనం కొనసాగించిన ఉద్యమ కవిగా పేర్కొన్నారు. అవమానాల మధ్య తీసుకున్న ఛాలెంజ్‌తోనే రెండు వేల సినిమాల్లో మూడు వేల పాటలు రాయగలిగానని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అశోక్ తేజను శాలువా, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ కవి నాశేశ్వరం శంకరం, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలాచారి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అరుణా భాయి, తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ మహంతయ్య, డాక్టర్ సుమతీదేవి, డాక్టర్ శ్రీనివాస్, రాపోలు సుదర్శన్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల వద్ద రైతుల ఆందోళన

హత్నూర, ఆగస్టు 21: పంట రుణమాఫీ కాని రైతులు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంతోపాటు రైతు వేదికల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో బుధవారం రైతులు అక్కడకు చేరుకున్నారు. అయితే అధికారులు దరఖాస్తులు స్వీకరించకపోవడంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. కాసాల-దౌల్తాబాద్ క్లస్టర్ పరిధిలోని రైతువేదిక వద్దకు దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లిన రైతులకు రైతు వేదికకు తాళంవేసి ఉండడంతో ఎవరిని సంప్రదించాలోతెలియక ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయశాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదిస్తే దరఖాస్తు ఫారంలో మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నామని, రెండు రోజుల తర్వాత వచ్చి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారని పేర్కొన్నారు.

కాసాల-దౌల్తాబాద్ రైతువేదిక వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

చెత్త తొలిగించనందుకు..

చౌటకూర్, ఆగస్టు 21:మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చాయ్ చెస్కా హోటల్‌కు నోటీసు జారీ చేశారు. హోటల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి పరిసర ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోపాటుగా చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారంటూ సామాజిక కార్యకర్త కాశపాగ ఇమ్మయ్య జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశాడు. తినుబండారాల కవర్లు, చాయ్ గ్లాసులు, చాయ్ తయారీకి ఉపయోగించిన అనంతరం వచ్చే వ్యర్థ పదార్థాలను ప్రధాన రోడ్లకు ఇరువైపులా పారబోశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన డీపీవో వెంటనే హోటల్ యజమానికి నోటీసు జారీ చేయాలంటూ సుల్తాన్‌పూర్ పంచాయతీ కార్యదర్శి పావనిని ఆదేశించారు. వెంటనే స్పందించిన ఆమె బుధవారం హోటల్‌ను సందర్శించి, పరిసరాలను అపరిశుభ్రంగా ఉండటాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, టాయిలెట్లు వంటి మౌలిక సౌకర్యాలు లేవని గుర్తించారు. ఈ విషయమై హోటల్ యజమానికి నోటీసు జారీ చేశారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఆరోపణలు

గుమ్మడిదల, ఆగస్టు 21: బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అనంతరం మాజీ సర్పంచ్ దీపానరేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ నాయకులు, కొంతమంది యువకులు పంచాయతీ మాజీ పాలకవర్గంపై నిరాధారమైన ఆరోపణలు చేయడంపై బుధవారం మాజీ ఉపసర్పంచ్ స్వరూపాల క్ష్మణ్, మాజీ వార్డు సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన ఐదేండ్ల కాలంలో గ్రామంలో దాదాపు రూ.10 కోట్ల నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసి మోడల్ పంచాయతీగా అవార్డు తీసుకున్నానన్నారు. గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తే సీజీఆర్ ట్రస్ట్‌ను, జీపీ నిధుల దుర్వినియోగం అంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్ ప్రెస్‌మీట్‌లో అన్ని అవాస్తవాలే ఉన్నాయని, నిధుల దుర్వినియోగం జరిగిందని తేలితే చట్టపరంగా శిక్షకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు.

మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ దీపానరేందర్‌రెడ్డి

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

కంగ్టి, ఆగస్టు 21: పంట రుణమాఫీ చేయడంతో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం కంగ్టి, తడ్కల్ గ్రామాల్లో విలేకరులతో మాట్లాడారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణాన్ని మాఫీ చేసేంతవరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు గురువారం నారాయణఖేడ్‌లో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కోహీర్‌లో..

కోహీర్, ఆగస్టు 21: రుణమాఫీ వర్తించని ప్రతి రైతుకూ న్యాయం చేసేందుకు గురువారం జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. అందరూ ఉదయం 10గంటలకు ఆర్డీవో కార్యాలయానికి చేరుకోవాలన్నారు. ధర్నా అనంతరం వినతిపత్రం ఇస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొనాలని కోరారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల పంట రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు యంజాల సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నేటి రైతు మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు.

సదాశివపేటలో..

సదాశివపేట, ఆగస్టు 21: సంగారెడ్డిలో గురువారం నిర్వహించే రైతుధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాలతో సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మంత్రి దామోదరకు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సంగారెడ్డి, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఈ నెల ఒకటిన వెలువరించిన తీర్పును గౌరవిస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మంత్రికి ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం మంత్రి కలెక్టరేట్‌లో ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వశాఖల అధికారులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రికి ప్రజాసంఘాల నాయకులు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలన్నారు. నాయకులు మురహరి, గంగేరి శ్రీనివాస్, రామని అశోక్, వేణుగోపాల్, ప్రసన్న, అనిల్‌కుమార్, మల్లేశ్, రామకృష్ణ ఉన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల ఆధ్వర్యంలో..

తెలంగాణ పాంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి దామోదరను కలిసి వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పెండింగ్ డీఏలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింలు, రాహుల్ ఉన్నారు.

బర్రెల మృతిపై భగ్గుమన్న కిష్టయ్యపల్లి

మృతి చెందిన మూగజీవాలతో సనత్‌నగర్‌లోని పీసీబీ కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నా

జిన్నారం, ఆగస్టు 21: గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన బశెట్టి సాయికి చెందిన బర్రెలు మూడు రోజుల్లో వరుసగా ఐదు మృతి చెందాయి. సోమ, మంగళవారాల్లో ఒక్కొక్కటి మృతి చెందగా, బుధవారం మూడు బర్రెలు ఒకే సారి మృతి చెందాయి. మరో మూడు బర్రెలు అనారోగ్యం బారిన పడ్డాయి. రసాయనాలు కలిసిన నీటిని తాగడంతోనే బర్రెలు మృతి చెందాయని మంగళవారం అయ్యమ్మ చెరువు కట్టపై ఆందోళన చేసిన బాధిత కుటుంబానికి గ్రామస్తులు, నాయకులు మద్దతు తెలిపారు. దాదాపు గంటపాటు ఆందోళన చేసి పరిశ్రమలకు వచ్చే బస్సులను నిలిపేశారు. బుధవారం ఉదయం మరో మూడు బర్రెలు మృతి చెందడంతో పరిశీలించేందుకు వచ్చిన రామచంద్రాపురం పీసీబీ అధికారులను బాధితులు, గ్రామస్తులు కొద్దిసేపు నిర్బంధించారు. పరిశ్రమలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. అధికారులు రసాయన వ్యర్థాలను శాంపిల్స్ తీసుకెళ్లారు. బుధవారం సైతం మృతి చెందడంతో ఆగ్రహించిన బాధితులు, గ్రామస్తులు, నాయకులు సనత్‌నగర్‌లోని పీసీబీ కేంద్ర కార్యాలయానికి మృతి చెందిన బర్రెలను తీసుకువెళ్లి గేటు ఎదుట ఆందోళన చేశారు. పీసీబీ డౌన్ డౌన్.. వీ వాంట్ జస్టిస్.. బాధితుడికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం పీసీబీ ఉన్నతాధికారికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాశెట్టిరాజు, నాయకులు వేణుగోపాల్, పెంటేశ్, సత్యనారాయణ, కుమార్, సందీప్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ పీసీబీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు, నాయకులు

సీసీ రోడ్ల పనులను త్వరగా పూర్తిచేయాలి

ఎల్ఐజీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 21: సీసీ రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయించాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని ఎల్ఐజీలో రూ.51లక్షలతో సీసీ రోడ్ల పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఇప్పటికే వేసిన సీసీ రోడ్డుని పరిశీలించారు. మిగిలి ఉన్న సీసీ రోడ్ల పనులను త్వరగా ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, ఏఈ చంద్రశేఖర్, డైరెక్టర్లు లక్ష్మణ్, రాంబాబు, రాజలింగం, శామ్యూల్‌జాన్, కాలనీవాసులు ప్రవీణ్ పాల్గొన్నారు.

సంపద వనాన్ని అభివృద్ధి చేయాలి

సిర్గాపూర్, ఆగస్టు 21: పర్యావరణ పరిరక్షణకు ఏర్పాటు చేసిన సంపద వనాలను వృద్ధి చేయాలని చార్మినార్ సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ విజిలెన్స్ డీఎఫ్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని సుల్తానాబాద్‌ను ఆయన సందర్శించి స్థానికంగా ఉన్న సంపద వనం స్థితిగతులను ఏపీడీ రాజు, ఎంపీడీవో మల్సూర్‌నాయక్‌తో కలిసి తెలుసుకున్నారు. సిర్గాపూర్ మండలంతోపాటు ఝరాసంగం, పుల్కల్, హద్నూర్ నాల్గు చోట్ల సంపద వనాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

రోడ్లపై గుంతలు ఉండొద్దు

కంది, ఆగస్టు 21: గ్రామాల్లోని రహదారులపై గుంతలు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చేర్యాల్‌లో బుధవారం బురదమయంగా మారిన గుంతల రోడ్లపై మట్టి పోయించారు. మురికి నీటితో దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి సుదీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ

గుమ్మడిదల, ఆగస్టు 21: దేశంలోనే ఒకే పీఠంపై శ్రీరాముడి కుటుంబం దర్శనమిచ్చే ఏకైక ఆలయం గుమ్మడిదల కల్యాణ రామచంద్రస్వామి ఆలయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదలలోని శ్రీరామ్‌నగర్‌గుట్టపై వెలిసిన కల్యాణ రామచంద్రస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఆలయకమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, ధర్మకర్తలు, గ్రామపెద్దల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సంగారెడ్డి, ఆగస్టు 21: హనుమాన్ ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అమీరొద్దీన్ రూ.లక్ష విరాళం చెక్కును గ్రామ పెద్దలకు అందజేశారు. బుధవారం మండల పరిధిలోని కులబ్‌గూర్ గ్రామంలోని పెద్దల సమక్షంలో కొత్తగా ఆలయ నిర్మాణం చేపట్టిన గ్రామస్తుల కోరిక మేరకు తనవంతు ఆర్థికసాయాన్ని అందజేసినట్లు తెలిపారు. జనవరి వరకు సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సజీదాబేగం తరపున అమీరొద్దీన్ నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆశం అలీ, చంద్రయ్య, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

సిరిపురలో వైద్యపరీక్షలు

హత్నూర, ఆగస్టు 21: మండలంలోని సిరిపురలో బుధవారం ఆయుష్ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వృద్ధులకు మదుమేహం, రక్త పోటు, కీళ్లనొప్పులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మచ్చనరేందర్ పాల్గొన్నారు.

ప్రమోషన్లపై ఉద్యోగుల ఆందోళన

ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

సంగారెడ్డి, ఆగస్టు 21: విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ప్రమోషన్ల కోసం ఆందోళన చేపట్టారు. బుధవారం పట్టణంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం అధ్యక్షుడు కనకరాజు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ మంత్రి జిల్లా అధికారులకు స్పష్టంమైన ఆదేశాలు జారీ చేసినా స్థానిక సూపరింటెండెంట్ ఇంజినీర్ ఉద్యోగుల ప్రమోషన్లపై నిర్లక్ష్యం చేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. ప్రమోషన్లపై ఎస్ఈ పరిశీలించి న్యాయం చేయాలని, లేనిచో ప్రతి రోజూ ఒక నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యదర్శి శ్రీనివాస్, వర్కింగ్ అధ్యక్షుడు రంజిత్, అదనపు కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు రాములు, వెంకట్‌రెడ్డి, రమేశ్, ఎల్లయ్య, సుజాత, శివలక్ష్మి, మీనా, పాల్, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్ సాగర్‌కు అత్యున్నత అవకాశం

నారాయణఖేడ్, ఆగస్టు 21: సుప్రీం కోర్టు న్యాయవాదిగా పలు సేవలు అందిస్తున్న నారాయణఖేడ్‌కు చెందిన న్యాయవాది ఉదయ్ సాగర్ శెట్టికి మరో అత్యున్నత అవకాశం లభించింది. సుప్రీం కోర్టులో తమ రాష్ట్రం తరపున వాదించేందుకు రాజస్థాన్ ప్రభుత్వం ఉదయ్‌సాగర్ శెట్టిని ఏవోఆర్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయ్‌సాగర్ ఇప్పటికే బోత్స్వాన దేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా సేవలందిస్తుండగా, హర్యానా రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. ఇవే కాకుండా పలు కీలక పదవుల్లో కొనసాగుతున్న ఉదయ్ సాగర్‌శెట్టి నారాయణఖేడ్ పట్టణానికి చెందిన వారు కావడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయ్ సాగర్ తన ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడుతున్నారు.

మహబూబ్ సాగర్‌లో చేపలు మృతి



అధికారులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 21: జిల్లా కేంద్రానికి ట్యాంక్‌బండ్‌గా పిలవబడే మహబూబ్‌సాగర్ చెరువులో నీళ్లు కాలుష్యం కావడంతో చెరువులోని చేపలు మృతిచెందాయి. దాదాపు లక్షలకు పైగా నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. చెరువులో పెరిగిన చేపలు బుధవారం ఉదయం నీళ్లపై తేలియాడటంతో మత్స్యకారులు గమనించి వెంటనే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన జగ్గారెడ్డి వెంటనే చెరువుకు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు జగ్గారెడ్డికి చెరువులో గుర్రపు డెక్క, పట్టణ మురికినీళ్లతో మట్టి పెరుకుపోవడంతో కాలుష్య జలాలుగా మారి చేపల మృతి చెందుతున్నాయన్నారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ మత్స్యకారులు ఎవరూ అధైర్యపడవద్దని, మంత్రులకు వివరించి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. చెరువులో రూ.5లక్షల చేపపిల్లలు వేస్తే ప్రస్తుతం 2లక్షల చేపలు మృతి చెందాయని, మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి నివేదిక సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్, మున్సిపల్, మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారులు, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

సంగారెడ్డి, ఆగస్టు 21: పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో చేపల మృతితో జీవనోపాధి కోల్పోయిన గంగపుత్రులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు కోరారు. బుధవారం చెరువును పరిశీలించారు. సుమారు 500ఎకరాల విస్తీర్ణంతో ఉన్న చెరువు ద్వారా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆకస్మికంగా చెరువు నీళ్లు కాలుషితం కావడంతోనే చేపలు మృతి చెందాయని ఆయా శాఖల అధికారులు చెప్పడం ఆశ్చర్యకరమని, అధికారుల పర్యవేక్షణ లోపంతోనే జరిగినట్లు అర్థమవుతుందన్నారు. మృతి చెందిన చేపలకు మత్స్యకారులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

రోడ్డును బాగు చేయాలి

ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జిన్నారం, ఆగస్టు 21: శివనగర్-పెద్దకంజర్ల చౌరస్తా రోడ్డును బాగు చేయించాలని బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి మండల నాయకులతో కలిసి ఎంపీకి వినతి